క్లుప్తంగా

పేర్నమిట్టలో బోరు ఏర్పాటుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న తేళ్ల చంద్రశేఖర్

చీమకుర్తి: పేర్నమిట్ట ఇందిరానగర్‌లో బోరు ఏర్పాటుకు స్థానిక కార్పొరేటర్ తేళ్ల చంద్రశేఖర్ గురువారం శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజల నీటి అవసరాల నిమిత్తం వారి విజ్ఞప్తి మేరకు ఒంగోలు కార్పొరేషన్ నిధులతో బోరు ఏర్పాటు చేసినట్లు కార్పొరేటర్ తెలిపారు.

నేటి నుంచి సీతారామ లక్ష్మణ విగ్రహాల ప్రతిష్ఠ

దొనకొండ: మండలంలోని చందవరం గ్రామ కమిటీ మూకుమ్మడిగా నేటి నుంచి 19వ తేదీ వరకు సీతా రామ లక్ష్మణ గుడి, విగ్రహా, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు చేపడుతున్నారు. పురోహితులు గో పూజ, గణపతి పూజ, పుణ్యాహ వాచకం, అఖండ దీప ప్రతిష్ఠ, సర్వతోభద్ర కళశ స్థాపనం, రుద్రాభిషేకం, దీప ప్రతిష్ఠ, పారాయణం, హనుమాన్ చాలిసా, తీర్థ ప్రసాద వినియోగం చేశారు.

నేటి నుంచి ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు

కొనకనమిట్ల: మండలంలోని సలనూతల గాజులపల్లిలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు శ్రీగంగాపార్వతీ సమేత రామ లింగేశ్వరస్వామి నూతన కీర్తి ధ్వజ గోపుర శిఖర కలశ ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు ముచ్చా వెంకటరెడ్డి తెలిపారు. మూడు రోజుల పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు ఎన్నికల సమర శంఖారావం ప్రారంభం

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శుక్రవారం నుంచి ఎన్నికల సమర శంఖారావం పూరించనుంది. ముందుగా మండలంలోని మురారిపల్లెలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ సిద్ధం అయ్యారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబుల రెడ్డి తెలిపారు. సాయంత్రం 5 గంటలకు మురారిపల్లె, రాత్రి 7 గంటలకు కాశికుంట తండా, 9 గంటలకు బోయలపల్లెలో ప్రచారం జరుగుతుందని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం

దర్శి: పట్టణంలోని 17వ వార్డులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మన ఊరికి మన శివన్న కార్యక్రమం శుక్రవారం ఉదయం 7 గంటలకు నిర్వహించనున్నట్లు కార్యాలయం ప్రతినిధి సందిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి కురిచేడు మండలం నాయుడుపాలెం పంచాయతీలో ప్రచారం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు హాజరవుతారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు

కరాటేలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని

గిద్దలూరు రూరల్: పట్టణంలోని శ్రీ సాయిచైతన్య డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని హేమలత కర్నాటకలో నిర్వహించిన ఆల్ ఇండియా లెవెల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరచి గోల్డ్‌మెడల్ సాధించినట్లు కరాటే మాస్టర్ బూతరాజు శ్రీను తెలిపారు. బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న హేమలత 19 సంవత్సరాల విభాగంలో ఫైట్ స్పారింగ్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించింది. ఈ సందర్భంగా హేమలతను కళాశాల కరస్పాండెంట్ జి.రంగస్వామిరెడ్డితో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ప్రారంభం

దొనకొండ: స్థానిక అంబేడ్కర్ సర్కిల్ కురిచేడు రోడ్డులో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని బ్యాంక్ మేనేజర్లు టి.అశోక్, చిన్ననాయక్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ ఆర్థిక అక్షరాస్యత పెంపొందించుకోవాలని, ఆర్థిక వ్యవహారాలు రిజర్వ్ బ్యాంక్ గుర్తించిన సేవలు చేయాలన్నారు. ఆర్థిక సంస్థల్లో మోసాలు జరిగితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మన్ ద్వారా పరిష్కారం పొందొచ్చన్నారు. కురిచేడు, కొనకనమిట్ల మండలాల్లో ఈ ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సేవలు ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలన్నారు. సామాజిక భద్రత పథకాల గురించి అవగాహన చేశారు. కంభం సీఎఫ్ఎల్ కౌన్సిలర్ రాజకుమార్, దొనకొండ సీఎఫ్ఎల్ కౌన్సిలర్ శ్యామ్‌బాబు, హసినా పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

- సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం పాలవగా, ఆ కుటుంబాలను సీఎంఆర్ఎఫ్ ఫండ్ ద్వారా ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదుకున్నారు. కొత్తపట్నం మండలం ఈతముక్కల ఎస్సీకాలనీ వాసులు బండెల మేరీరత్నం, బండెల ప్రవీణ్‌కుమార్, మేళం దిలీప్‌కుమార్ 2023 ఆగస్టు 6వ తేదీ ఎం.నిడమానూరు నుంచి ఈతముక్కల వస్తుండగా రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. బాధిత కుటుంబాలను ఆ సమయంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో పాటు ఆయన కుమారుడు ప్రణీత్‌రెడ్డి కలుసుకుని అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అందులో భాగంగా ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చొప్పున ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి నిధులు విడుదల కాగా, సంబంధిత చెక్కులను గురువారం బాలినేని తన నివాసంలో ఆయా కుటుంబాలకు అందించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ మరణించిన వారిని తీసుకురాలేమని, కాకుంటే ఆ కుటుంబాలకు అండగా ఉండేందుకు ఈ మొత్తం సాయపడుతుందని అన్నారు. ఈ నిధులను సద్వినియోగం చేసుకోవాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా బాలినేనికి బండెల సురేష్‌కుమార్, బండెల అనీల్‌కుమార్, అమృతపాణి, బాధిత కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ కొత్తపట్నం మండల సచివాలయ కన్వీనర్ ఆళ్ల రవీంద్రారెడ్డి, మండల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

అనారోగ్య బాధితుడికి రూ.3.60 లక్షలు అందజేత



చెక్కు అందిస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి

కొత్తపట్నం: కొత్తపట్నం మండలం పాదర్తి గ్రామానికి చెందిన మూగ రిద్విక్‌రాజ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అప్పులు తెచ్చి చికిత్స పొందుతున్నాడు. పాదర్తి సర్పంచ్ సౌందర్య భర్త కట్టా శేఖర్, ఎంపీటీసీ సభ్యుడు గుడి అరుణ భర్త నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు మూగ బాలాజీ, ఆదినారాయణ దృష్టికి తీసుకెళ్లారు. వారు ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.3.60 లక్షలు మంజూరవగా, ఆ మొత్తానికి సంబంధించిన చెక్కును గురువారం ఒంగోలులోని బాలినేని నివాసంలో ఆయన తనయుడు, వైఎస్సార్ సీపీ యువనేత బాలినేని ప్రణీత్‌రెడ్డి చేతుల మీదుగా రిద్విక్‌రాజ్‌కు అందజేశారు. బాలినేని శ్రీనివాసరెడ్డికి, నాయకులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్

ఒంగోలు: రహదారి భద్రతపై స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులకు గురువారం జిల్లా రవాణాశాఖ, రైజ్ ఎన్ఎస్ఎస్, ఏవోఎంఎస్ఐలు సంయుక్తంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రిమ్స్ వైద్యులు డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నేడు ఎంతో మంది రహదారి ప్రమాదాలలో మరణిస్తున్నారన్నారు. సగటున 44 శాతం ద్విచక్రవాహనదారులు ఉంటున్నారన్నారు. వారిలో 62 శాతం మంది 45 సంవత్సరాల్లోపు వారు మరణిస్తున్నారని తెలిపారు. దీనికి ప్రధాన కారణాలు సెల్‌ఫోన్ డ్రైవింగ్, మాదక ద్రవ్యాలు సేవించి వాహనం నడపడం, హెల్మెట్, సీటు బెల్టు ధరించకపోవడం వంటివని తెలిపారు. ప్రమాదానికి గురైన వారికి తక్షణమే ప్రథమ చికిత్స అందించడం ద్వారా బతికించుకోవడం సాధ్యపడుతుందనే అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎంవీఐ ఎస్.జగదీష్ మాట్లాడుతూ రహదారి భద్రత చట్టాలు చాలా శక్తివంతంగా ఉన్నాయన్నారు. ఎవరూ అతిక్రమించరాదని, విద్యార్థులు, యువత దేశానికి శక్తి అని అన్నారు. అటువంటి యువత రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని కోరారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని రక్షించినట్లయితే వారికి ఇప్పటి చట్టాల ప్రకారం ఎలాంటి ఇబ్బంది ఉండదని, అపోహలు వీడి తోటి వారిని రక్షించేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులతో రహదారి భద్రత చట్టాలు పాటిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఏవీ భాస్కరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ సుబ్రహ్మణ్యం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎస్.సంపత్‌కుమార్, ఎ.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు రథసప్తమి

- వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు



ఒంగోలు కేశవస్వామిపేటలోని ప్రసన్నచెన్నకేశవ స్వామి దేవస్థానం వద్ద నేడు రథోత్సవానికి సిద్ధంగా ఉన్న స్వామివారి రథం

ఒంగోలు మెట్రో: ప్రత్యక్ష దేవుడైన సూర్యుడి జన్మదిన మఘశుద్ధ సప్తమి (రథసప్తమి) సందర్భంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా వైష్ణవ ఆలయాలలో వైభవంగా వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఒంగోలులోని ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానంలో ఏర్పాట్లు పూర్తిచేశారు. రథోత్సవానికి కలశ స్థాపన నిర్వహిస్తున్నారు. 70 సంవత్సరాల తర్వాత ఒంగోలు నగరంలో స్వామి వారు రథంపై పురవీధులలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డి పాల్గొంటారని దేవస్థాన చైర్మన్ తెలిపారు.

శ్రీగిరిలో ఆదిత్య హోమం...

రథసప్తమి సందర్భంగా శుక్రవారం ఒంగోలు కొండమీద గల శ్రీగిరి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి వెల్లడించారు. ఉదయం ఆరు గంటలకు అభిషేకం, తొమ్మిది గంటలకు శ్రీవారికి సూర్యప్రభ వాహనసేవ, 9.30కు ఆదిత్య హోమం నిర్వహించనున్నారు.

ఒంగోలు దక్షిణ బజారులో సప్త వాహనాల సేవ...

స్థానిక గాంధీరోడ్డు దక్షిణం బజారులో వెంకటేశ్వరస్వామి మందిరం నుంచి వెంకటేశ్వర బాలభక్త సమాజం ఆధ్వర్యంలో రథసప్తమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. తిరుమల తరహాలో ప్రాతఃకాలమున సూర్యప్రభ వాహనం, సర్వభూపాల వాహనం, శేష వాహనం, సింహ వాహనం, హనుమంత సేవ, గరుడ సేవ, చంద్రప్రభ వాహన సేవలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు చుండూరు వాసుదేవ మూర్తి తెలిపారు.

మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మహిళా చట్టాలపై ప్రసంగిస్తున్న డీబీఆర్సీ సభ్యులు

ఒంగోలు టౌన్: మహిళల రక్షణ, హక్కుల గురించి ప్రతి ఒక్క మహిళ అవగాహన కలిగి ఉండాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రాష్ట్ర మహిళా కో ఆర్డినేటర్ ఎం.హేమలత సూచించారు. గురువారం స్థానిక టీటీడీసీలో డీబీఆర్సీ, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందడం, ఉన్నత విద్యనభ్యసించడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించడం గురించి పట్టుదలగా కృషి చేయాలని సూచించారు. ఆడపిల్లలను రక్షించుకునేందుకు నేటికీ చట్టాలపై ఆధారపడాల్సిన అవసరం రావడం దురదృష్టకరమని కనిగిరి ఏరియా కో ఆర్డినేటర్ కత్తి కళ్యాణ ఆవేదన వ్యక్తం చేశారు. వర్తమాన సమాజంలో మహిళలు మరింత కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని చెప్పారు. బాల్య వివాహాల చట్టం, గృహహింస చట్టం గురించి రీజినల్ కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వర రావు వివరించారు. మహిళల ఆరోగ్య భద్రతకు హాని కలిగించడం, మహిళలను శారీరకంగా బాధించడం, వరకట్నం కోసం వేధించడం, అశ్లీల చిత్రాలను చూడాల్సిందిగా ఒత్తిడి చేయడం, మగ పిల్లను కనాలని చెప్పడం నేరమని జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ వేము రామాంజనేయులు తెలిపారు. మహిళల సామాజిక ఆర్థికాభివృద్ధితోనే సమాజాభివృద్ధిని లెక్కిస్తానని అంబేడ్కర్ చెప్పిన మాటలను ఏపీఎం ఘంటా శ్రీనివాసరావు గుర్తుచేశారు. కార్యక్రమంలో కత్తి కోటేశ్వర రావు, గుంటూరు నాగమణి, తోపనబోయిన వెంకట రావు, జిల్లా మహిళా సమైక్య అధ్యక్ష కార్యదర్శులు గోవిందమ్మ, నాగమణి పాల్గొన్నారు.

రైతులపై లాఠీచార్జి చేయడం అమానుషం

ఒంగోలు టౌన్: ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించమని అడిగిన రైతులపై పోలీసులతో కేంద్ర ప్రభుత్వం లాఠీచార్జి చేయించడం అమానుషమని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. మోదీ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రదర్శన చేపట్టిన రైతాంగంపై పోలీసులను ఉసిగొల్పడం సిగ్గుచేటన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం నిరసన ప్రదర్శన చేసేందుకు ఢిల్లీ వస్తున్న రైతులను అడ్డుకునేందుకు ముల్లకంచెలు, సిమెంటు దిమ్మెలతో పాటు రోడ్లపై మేకులు కొట్టడం చరిత్రలో ఎవరూ చేయలేదన్నారు. ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలు ప్రయోగించినా ఛేదించుకుని రైతులు ఢిల్లీ చేరుకున్నారని తెలిపారు. పోలీసుల క్రూరమైన దాడిలో అనేక మంది రైతులు తీవ్రంగా గాయపడ్డారని, దేశానికి అన్నం పెట్టే రైతులకు మోదీ ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

హనోక్ బెంజిమన్‌కు ఏఎన్‌యూ డాక్టరేట్



హనోక్ బెంజిమన్‌ను సత్కరిస్తున్న ఏకేయూ వీసీ మారెడ్డి అంజిరెడ్డి

ఒంగోలు: కర్రా హనోక్ బెంజిమన్‌కు ఏఎన్‌యూ డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేసింది. ది ప్రాబ్లమ్స్ ఆఫ్ దళిత్ క్రిస్టియన్స్ ఇన్ గుంటూరు డిస్ట్రిక్ట్ అనే తులనాత్మక అంశంపై ఆయన చేసిన పరిశోధనకుగానూ ఈ డాక్టరేట్ లభించింది. ఈయన ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగంలో సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్న మండే హర్షప్రీతమ్ దేవ్‌కుమార్ పర్యవేక్షణలో ఈ ప్రాజెక్టు వర్కు పూర్తిచేశారు. ఈ సందర్భంగా హనోక్ బెంజిమన్‌తో పాటు ఆయనకు మార్గదర్శకత్వం చేసిన హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్‌ను ఏకేయూ వీసీ మారెడ్డి అంజిరెడ్డి అభినందించారు.

హెచ్ఎం అకౌంట్ టెస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: హెడ్మాస్టర్స్ అకౌంట్ టెస్టుకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 17వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి డి.సుభద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు పేపర్లకు కలిపి రూ.150, ఒక పేపర్‌కు రూ.100 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.60 అపరాధ రుసుంతో ఈనెల 22వ తేదీ వరకు గడువు ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

విశ్వబ్రాహ్మణుల సంఘ అధ్యక్షుడిగా వీరభద్రాచారి

గిద్దలూరు రూరల్: విశ్వబ్రాహ్మణుల సంఘ గిద్దలూరు నూతన అధ్యక్షుడిగా ఎం.వీరభద్రాచారిని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గిద్దలూరు పరిసర ప్రాంతంలో ఈ నెల 11వ తేదీ వరకు సభ్యత్వ నమోదు ప్రక్రియ నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన ఎన్నికల్లో మొత్తం 102 మంది సభ్యులు పాల్గొని వీరభద్రాచారిని అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు, ఈ ఎన్నికల నిర్వహణ కర్త శ్రీనివాసాచారి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.

సేవావజ్ర, సేవారత్నలకు అభినందనలు తెలిపిన ఎంపీడీఓ

మద్దిపాడు: మండలంలో సేవావజ్ర, సేవారత్నలుగా ఎంపికైన వలంటీర్లను ఎంపీడీఓ సుగుణమ్మ అభినందించారు. మండలంలోని లింగంగుంట సచివాలయానికి చెందిన పిట్టల లక్ష్మీదుర్గ, దొడ్డవరం సచివాలయానికి చెందిన బొల్లెద్దు వినయ్ సేవావజ్రలుగా ఎంపికయ్యారని తెలిపారు. సేవారత్నలుగా ఇనమనమెళ్లూరు సచివాలయానికి చెందిన వాలేటి సుభాషిణి, దొడ్డవరం సచివాలయానికి చెందిన శ్రీరాముల ఝాన్సీ రాణి, అన్నంగి సచివాలయానికి చెందిన కుంచాల హరికృష్ణ, మల్లవరం సచివాలయానికి చెందిన గుండ్లాపల్లి మణికంఠ సుగుణాచారి, కొలచనకోట సచివాలయానికి చెందిన కొక్కిలగడ్డ ప్రతాప్ ఎంపికయ్యారు. మిగిలిన వారంతా సేవామిత్ర పురస్కారాలను అందుకుంటున్నారని చెప్పారు. వారందరికీ ఎంపీడీఓ అభినందనలు తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు అర్బన్: కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడంలో జాప్యం జరుగుతోందని, త్వరగా రెగ్యులర్ చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా చైర్మన్ శరత్‌బాబు ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నాయకులు గురువారం నల్ల బాడ్జీలతో కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. పలువురు నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రభపై మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు



సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షిస్తున్న ప్రేక్షకులు

చీమకుర్తి: సంతనూతలపాడులో బొడ్డు రాయి ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ వేడుకల సందర్భంగా బుధవారం రాత్రి విద్యుత్ ప్రభపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జునతో పాటు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, దుంపా యలమందారెడ్డి, స్థానిక సర్పంచ్ దర్శి నాగమణి, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ప్రభపై కార్యక్రమాలను వీక్షించారు. ప్రభపై డ్యాన్సర్లు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

సమన్వయంతో ముందుకు సాగుదాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న బాలినేని శచీదేవి

- సంక్షేమం, అభివృద్ధే అజెండాగా వాసన్నను గెలిపించుకుందాం
- ఎమ్మెల్యే బాలినేని సతీమణి శచీదేవి

ఒంగోలు: ఒకరికొకరం తోడుగా అందరం ఒక్కటై ముందుకు కదులుదామని, రాబోయే ఎన్నికల్లో సంక్షేమం, అభివృద్ధే అజెండాగా వాసన్నను మరోమారు గెలిపించుకుందామని స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సతీమణి బాలినేని శచీదేవి పిలుపునిచ్చారు. మహిళలతో మమేకం.. స్త్రీ శక్తితో శచీదేవి కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి స్థానిక 28వ డివిజన్‌లోని హరేరామ బజార్‌లో పర్యటించారు. పలువురు స్థానికులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సమస్యలు వివరించారు. స్థానిక కార్పొరేటర్ నీలం రాజు సరోజ స్పందించి మున్సిపల్ అధికారులతో మాట్లాడారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఆ వీధిలో సీసీ కెమేరాలు, డ్రైనేజీ కాలువకు ఈ నెల 20వ తేదీలోగా శంకుస్థాపన చేయడంతో పాటు ప్రకాశం పాఠశాలకు పడమర వైపు గేటు ఏర్పాటుచేసి రూ.15 లక్షలతో వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ పనులన్నీ వేగవంతంగా జరుగుతాయని, వాచ్‌మన్ కూడా స్కూలులో ఉండేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. స్థానికులు మాట్లాడుతూ సంవత్సరాల తరబడి పెన్షన్ రాని తమకు దరఖాస్తుచేసుకున్న రెండు నెలల్లో మంజూరవడం నిజంగా జగనన్న సంక్షేమ పాలనకు అద్దం పడుతుందన్నారు. వాసన్న అంటేనే ఒక నమ్మకం..జగనన్న అంటే ఒక భరోసా.. ఈ రెండూ వదులుకునేందుకు తాము సిద్ధంగా లేమని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో కూడా వాసన్నను గెలిపించుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

బాలినేని శచీదేవి మాట్లాడుతూ కరోనా సమయంలో వైద్యం అందక ఎంతోమంది ఎన్ని ఇబ్బందులు పడ్డారో ప్రతిఒక్కరూ గమనించాలన్నారు. నేడు విమర్శిస్తున్న వారంతా ఆనాడు ఎక్కడకు వెళ్లారో తెలియదని, కానీ తాము మాత్రం ప్రజల వెన్నంటే ఉండి రిమ్స్‌లో జర్మన్‌షెడ్, మినీ ఆక్సిజన్ సిలిండర్లతో ఆధునిక వైద్య సేవలు అందేలా అనేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. గొప్పలు చెప్పుకోవడం వాసన్నకు చేతకాదని, లబ్ధిపొందిన ప్రతిఒక్కరూ తమ సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించుకునేందుకు కృషిచేయాలని కోరారు. గతంలో విద్యుత్ లో ఓల్టేజీ సమస్యతో నిత్యం బాధపడేవారిమని, కానీ, నేడు నియోజకవర్గ పరిధిలో 10 ప్రత్యేక సబ్ స్టేషన్లు నిర్మించడం ద్వారా విద్యుత్ అంతరాయానికి స్వస్తి పలికామని తెలిపారు. అంతేకాకుండా ఒంగోలు నగరంలో గతంలో నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లు ఉంటే.. నేడు అదనంగా 5 అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించి ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. 200 రకాల వైద్య పరీక్షలు సైతం ఆస్పత్రుల్లో అందుతున్న తీరును ప్రజలు గమనించాలన్నారు. ఏమైనా మీరే మా నమ్మకం...మీరే మా బలం అని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి మాట్లాడుతూ మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఏమీ లేదన్నారు. వారికి అటువంటి అవకాశాలు ఇవ్వాలనేదే మన వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అందులో భాగంగానే మహిళా సాధికారతకు పెద్ద పీట వేయడం, మహిళలకు నామినేటెడ్ పదవులతోపాటు ఆర్థికంగా కూడా బలోపేతం చేసేలా ఇళ్ల పట్టాలు అందించడం జరుగుతుందన్నారు. ఏ పథకం చూసినా మహిళలకే పెద్ద పీట వేస్తున్న దృష్ట్యా తమ సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు డాకా సుజాత, బేతంశెట్టి శైలజ, ఆదిపూడి గిరిజా శంకర శాండిల్య, తాడి కృష్ణలత, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొట్టిన టిప్పర్

దర్శి: దర్శికి చెందిన టిప్పర్.. ముందు వెళ్తున్న ట్రాక్టర్ ట్యాంకర్‌ను తప్పించబోయి చెట్టును ఢీకొట్టింది. గురువారం జరిగిన ఈ ఘటనలో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ ప్రమాదాన్ని గమనించి కిందకు దూకేయగా టిప్పర్ డ్రైవర్ మాత్రం టిప్పర్ క్యాబిన్‌లో ఇరుక్కున్నాడు. స్థానికులు వెంటనే అతడిని బయటకు తీసి 108లో ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్‌కు ఎటువంటి ప్రాణాపాయం లేదని తెలిపారు.

జూదరుల అరెస్టు

బేస్తవారిపేట: మండలంలోని ఎంపీ చెరువులో కోడిపందేల స్థావరాలపై ఎస్సై నరసింహారావు గురువారం దాడులు నిర్వహించారు. కోడిపందేలు ఆడుతున్న ముగ్గురిని అరెస్టు చేశారు. ఒక కోడి, రూ.5100 నగదు స్వాధీనం చేసుకున్నారు. గ్రామాల్లో పేకాట, కోడి పందేలు, నాటుసారా అమ్ముతున్న వారి వివరాలు అందజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

బెంగళూరుకు వెళ్లి ఈకేవైసీ చేయించిన వలంటీర్

తర్లుపాడు: మండలంలోని పోతలపాడుకు చెందిన వలంటీర్ రవితేజ వైఎస్సార్ చేయూతలో భాగంగా బెంగళూరుకు వెళ్లి లబ్ధిదారిరాలితో ఈకేవైసీ చేయించారు. రాచీటి ప్రేమమ్మ బంధువుల వద్ద ఉంటోంది. గ్రామానికి రాలేని పరిస్థితుల్లో వలంటీర్‌కు సమస్యను తెలియచేయడంతో బెంగళూరుకు వెళ్లి ప్రేమమ్మతో ఈకేవైసీ చేయించాడు. సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నకేశవులు, సచివాలయం సిబ్బంది పలువురు నాయకులు వలంటీర్‌ను అభినందించారు.